◆ వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
◆ ఈ నెల 15న చైతన్యనగర్‌లో పీఎం జన్‌మన్‌పై సదస్సు నిర్వహణ
◆ చెంచు జాతి ప్రజలకు 11 రకాల మౌలిక సౌకర్యాలు ఏర్పాటు
◆ జిల్లావ్యాప్తంగా 22 అనుబంధ చెంచు గ్రామాల గుర్తింపు
◆ అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

# చెంచు జాతి ప్రజలకు కనీస సౌకర్యాల కల్పన



చైతన్యనగర్‌లో 'పీఎం జన్‌మన్' కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పెద్దేముల్, జనవరి 3 : చెంచు జాతి ప్రజలను జీవితాల్లో వెలుగులు నింపి వారికి వ్యక్తిగతంగా, కుటుంబపరంగా కనీస మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా 'పీఎం జన్ మన్' పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చైతన్యనగర్‌లో సర్పంచ్ లలిత అధ్యక్షతన పీఎం జన్‌మన్ పథకం కింద చెంచు జాతి ప్రజలు పొందాల్సిన కనీస సౌకర్యాలపై చెంచు కుటుంబాలతో సమావేశాన్ని నిర్వహించారు. పలు సూచనలు, సలహాలను చేసి, చెంచు ప్రజలకు కనీస సౌకర్యాల దృష్ట్యా అందించాల్సిన సేవలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పీఎం జన్‌మన్(ప్రధానమంత్రి జన్ జాతీయ ఆదివాసీ న్యాయ్ అభియాన్)లో భాగంగా జిల్లాలో దాదాపు 22 అనుబంధ గ్రామాలను గుర్తించారు. అందులో ఎక్కువ మొత్తంలో చెంచుజాతి ప్రజలు నివాసం ఉంటున్న చైతన్యనగర్‌లో ఈ నెల 15న పెద్దఎత్తున సదస్సును నిర్వహించి చెంచు జాతి ప్రజలకు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు.

## దరఖాస్తు చేసుకోవాలి

ముఖ్యంగా పీఎం జన్‌మన్‌లో 11 రకాల ముఖ్యమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అందులో ప్రతి వ్యక్తికి ఆధార్‌కార్డు, కులం సర్టిఫికెట్, ప్రతి కుటుంబానికి బ్యాంకు అకౌంట్, పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డు, ఇంటింటికీ కరెంట్, నల్లా కనెక్షన్, గర్భిణులకు ఆర్థిక సాయం, ఉచిత నిత్యావసర సరుకులు, ఆయుష్మాన్ భారత్, పాలిచ్చే తల్లులకు పౌష్టికాహారం, అందరికీ పక్కా ఇండ్లు, ప్రతి గ్రామానికి రహదారి, కౌశల్ వికాస్, జీవనోపాధి పెరుగుదల, మెరుగైన టెలిఫోన్ సౌకర్యాల అనుసంధానత వంటి సౌకర్యాలు పొందడానికి చెంచు జాతి ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబానికి సౌకర్యాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామంలో ఆధార్‌కార్డు, నల్లా కనెక్షన్, విద్యుత్ కనెక్షన్, కులం సర్టిఫికెట్, పంట రుణాలు పొందనివారు, 2005 కంటే ముందు పోడు భూములను సాగు చేస్తున్నవారు, కిసాన్ క్రెడిట్, అబా కార్డులు లేనివారి జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.




## అధికారులు చర్యలు తీసుకోవాలి

గ్రామంలో ఆధార్ కార్డు లేనివారి కోసం ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మార్వోను, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు హెల్త్ క్యాంపును ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని, మిషన్ భగీరథ ద్వారా నల్లా కనెక్షన్ లేని వారికి నల్లా కనెక్షన్‌ను, గ్రామంలో ఎక్కడైనా లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇండ్లు, రోడ్లు, అంగన్‌వాడీ సెంటర్‌లపై వారం రోజుల్లో మరో సమావేశం ఉంటుందని, దరఖాస్తుల ప్రక్రియ బాధ్యతను స్థానికంగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చూసుకోవాలన్నారు. రేపటి నుంచి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండి 11 రకాల సౌకర్యాలను చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామస్తులు కలెక్టర్‌కు పలు సమస్యలను వివరిస్తూ దరఖాస్తులను అందించారు.

కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో కోటాజీ, డీఏవో గోపాల్, డీఈవో రేణుకాదేవి, డీఎంఅండ్‌హెచ్‌వో పాల్వన్‌కుమార్, డీడబ్ల్యూవో లలితాకుమారి, ఎమ్మార్వో కిషన్, విద్యుత్ డీఈ భానుప్రసాద్, ఏడీఈ ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంట్రా ఈఈ బాబు శ్రీనివాస్, లోన్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నాగరాణి, ఆర్‌ఐ రాజురెడ్డి, డాక్టర్ బుచ్చిబాబు, ఏఈ అఖిల్, సీడీపీవో రేణుక పాల్గొన్నారు.



సావిత్రీబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

# సావిత్రీబాయిపూలేను ఆదర్శంగా తీసుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం, జనవరి 3 : తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రీబాయిపూలేను నేటి మహిళా లోకం ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. బుధవారం సావిత్రీబాయిపూలే జయంతిని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే నినాదంతో ముందుకు సాగిన గొప్ప మహిళ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు మంగ, మమత, కమిషనర్ రవీంద్రసాగర్, ప్రధానోపాధ్యాయుడు సురేశ్ పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో..**

ఇబ్రహీంపట్నంరూరల్ : బడుగు, బలహీన వర్గాల కోసం మొదటగా పాఠశాలను ఏర్పాటు చేసిన గొప్ప మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే అని బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకుడు కానుగుల మహేశ్ అన్నారు. బుధవారం ఆమె జయంతిని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజు, గణేశ్, వీరేశ్, మహేశ్, శేఖర్, పరమేశ్ ఉన్నారు.



పోలీస్ కంట్రోల్ రూమ్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

# సమయపాలన పాటించాలి : ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 3 : పోలీసు సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎలాంటి ఫైళ్లను పెండింగ్‌లో పెట్టవద్దని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ కంట్రోల్ రూమ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పలు ఫైళ్లను పరిశీలించారు. ముఖ్యమైన ఫైల్స్ విషయంలో ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు కచ్చితంగా పాటించాలని ఎస్పీ సూచించారు. పోలీస్ సిబ్బందికి సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులు కూడా పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పూర్తి చేయాలని డీపీవో సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏవో జ్యోతిర్మయి, సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు, కంట్రోల్ రూమ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సగానికి తక్కువే..

○ కొనుగోలు చేసిన ధాన్యం 9,101 మెట్రిక్ టన్నులు
○ ఈ సీజన్ కొనుగోళ్లు దాదాపు పూర్తయినట్లే..
○ గత ఏడాది 20,409 మెట్రిక్ టన్నుల వానకాలం సీజన్ ధాన్యాన్ని కొనుగోలు చేసిన గత ప్రభుత్వం
○ బయటి మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేయడమే ఇందుకు కారణం

రంగారెడ్డి, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఈ ఏడాది వానకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు తగ్గాయి. గత ఏడాది వానకాలం సీజన్‌కు సంబంధించి కొనుగోలు చేసిన ధాన్యంలో సగం మాత్రమే ఈసారి ప్రభుత్వం కొనుగోలు చేయగలిగింది. అన్ని అనుకూల పరిస్థితుల నేపథ్యంలో వానకాలంలో రైతాంగం పుష్కలంగా పంటలను సాగు చేసింది. ఈ క్రమంలో దిగుబడులు సైతం భారీగానే వచ్చాయి. కానీ.. ధాన్యం మాత్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రాలేదు. దీంతో ఇప్పటివరకు కేవలం 9,101 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇక కేంద్రాలకు ధాన్యం వచ్చే పరిస్థితి లేదు. ధాన్యం కొనుగోళ్లపై రైతులకు సరైన అవగాహన కల్పించక పోవడం.. బయటి మార్కెట్‌లో దళారులు, వ్యాపారులు పెద్దఎత్తున ధాన్యాన్ని కొనుగోలు చేయడం వల్లనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు తగ్గడానికి కారణంగా తెలుస్తున్నది.



## ఈసారి 10వేల టన్నుల లోపే..

జిల్లాలో నీటిపారుదల పెరిగిన నేపథ్యంలో ఏటేటా సాగు విస్తీర్ణంతోపాటు ధాన్యం దిగుబడులు పెరుగుతూ వస్తున్నాయి. పంటలు అమ్ముకునేందుకు రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రాష్ట్ర ప్రభుత్వమే ధాన్యాన్ని కొనేలా చర్యలు తీసుకున్నది. ఈ క్రమంలో.. ఈ ఏడాది వానకాలం ధాన్యం అమ్ముకోవడంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం వడ్ల కొనుగోళ్ల కోసం జిల్లాలో 33 కేంద్రాలను ఏర్పాటు చేసింది. మూడు కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో, 20 కేంద్రాలను పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో, మరో 10 కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కొనుగోళ్లు జరిపింది. ఇప్పటివరకు 1,502 మంది రైతుల నుంచి 9,101 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు మాత్రమే జరిగాయి. ఈ మేరకు రూ.12కోట్ల మేరకు రైతులకు చెల్లింపులు జరిగాయి. ఈ సీజన్‌లో 10వేల మెట్రిక్ టన్నుల లోపే ధాన్యం కొనుగోళ్లు జరిగే అవకాశం ఉన్నదని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది 37 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గత ప్రభుత్వం వానకాలం సీజన్‌కు సంబంధించి 20,409 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. గతేడాదితో పోలిస్తే ధాన్యం కొనుగోళ్లు సగానికి సగం తగ్గాయి.

## దిగుబడులు పెరిగినా..

ఈసారి వానకాలంలో జిల్లాలో 3.35లక్షల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఒక్క వరి సాగునే 1,32,169 ఎకరాల్లో చేపట్టారు. ఈ మేరకు దిగుబడులు సైతం బాగానే రావడంతో 87వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. కానీ.. వారి అంచనాలు తలకిందులయ్యాయి. ఈసారి వడ్ల కొనుగోళ్లు జరుగుతాయా? లేదా అన్న సంశయంలో రైతులు ముందుగానే దళారులు, వ్యాపారులకు అమ్ముకున్నారు. కళ్లాల వద్దకే వెళ్లి వ్యాపారులు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే సన్న రకానికి బయటి మార్కెట్‌లో ఎక్కువ ధర పలకడంతో సన్న రకాన్ని వ్యాపారులకు అమ్మి, దొడ్డు రకాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తెచ్చారు. ఈ ప్రభావం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలపై పడి ధాన్యం కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయి.



కన్హాలో ప్లాస్మైజ్డ్ వాటర్ జనరేటర్ ప్రారంభంలో ప్లాస్మా వాటర్, హార్ట్‌ఫుల్‌నెస్ ప్రతినిధులు

# కన్హాలో ప్లాస్మైజ్డ్ వాటర్ జనరేటర్ ప్రారంభం

నందిగామ, జనవరి 3 : మండలంలోని కన్హా శాంతివనంలో అమెరికా అగ్రిటెక్ ప్లాస్మా సొల్యూషన్స్ పరిశ్రమ భాగస్వామ్యంతో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్లాస్మైజ్డ్ వాటర్ జనరేటర్‌ను ప్రారంభించినట్లు శ్రీరామచంద్రమిషన్ పీఆర్‌వో చంద్రారెడ్డి బుధవారం తెలిపారు. ఈ యంత్రం ద్వారా వాటర్, విద్యుత్ వినియోగంతో ప్లాస్మైజ్డ్ వాటర్‌గా మారుతుందన్నారు. కన్హాలో పెంచుతున్న మొక్కలకు ప్లాస్మైజ్డ్ వాటర్ ఎంతో ఉపయోగపడుతుందని, దేశంలో మొట్టమొదటిసారిగా వినియోగించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్లాస్మా వాటర్ సొల్యూషన్స్ సీఈవో రాబర్ట్, హార్ట్‌ఫుల్‌నెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.